క్లుప్తంగా

దొరబాబు గెలుపే లక్ష్యంగా ప్రచారం


ఇంటింటా ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ రెడ్నం సునీత, రెడ్నం దొరబాబు దంపతులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు గెలుపే లక్ష్యంగా అధికార పక్ష కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రచారానికి కేవలం నాలుగు రోజులే గడువు ఉండటంతో ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఈవీఎం నమూనాలతో ఎంపీ అభ్యర్థికి రెండో నంబరులో, ఎమ్మెల్యే అభ్యర్థికి నాలుగో నంబరులో ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని ప్రచారం చేస్తున్నారు. స్థానికుడైన దొరబాబుకు ప్రతి వార్డులోను, గ్రామాల్లోను మంచి స్పందన లభిస్తోంది.

సంక్షేమ సారథికి అండగా నిలవండి


పొన్నాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని ఎంపీపీ కారే సుధ కోరారు. మండలంలోని పొన్నాడ ఎస్సీపేటలో సోమవారం ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ సభ్యుడు బండి దావీదు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి పిఠాపురం ఎమ్మెల్యేగా వంగా గీత, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పింఛనుదారులకు మజ్జిగ పంపిణీ


పింఛనుదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: స్థానిక యూనియన్ బ్యాంకులో పింఛన్లు సొమ్ము తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులకు సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గత ఆరు రోజులుగా పింఛన్ల సొమ్ము కోసం లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు బ్యాంకుల వద్దకు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. వారి దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాపర్తి శ్రీనివాస్, దాకే రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్


ఇళ్ల వద్దకే రేషన్ సరకుల పంపిణీ చేసే వాహనం

- ఎండీయూ వాహనాలతో తొలగిన సమస్యలు
- నిరుద్యోగ యువతకు ఉపాధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సామర్లకోట: పేద ప్రజలకు రేషన్ సరకులు ఇళ్ల వద్దకే వచ్చి ఇవ్వడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట పట్టణ, మండల పరిధిలో 75 రేషన్ షాపులున్నాయి. గతంలో ఆయా షాపుల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వచ్చేది. నేడు ఇంటి వద్దకే ఎండీయూ వాహనం ద్వారా సరకులు అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో.. రేషన్ షాపులో డీలరు లేకపోతే తిరిగి రావలసి వచ్చేది. ఉదయం, సాయంత్రం మాత్రమే సరకులు ఇచ్చేవారు. అర కి.మీ. నుంచి కిలో మీటరు దూరంలో రేషన్ షాపులుండేవి. అనేక మంది రేషన్ దుకాణాలకు వెళ్లలేక, సరకులు తీసుకోవడం మానేసేవారు. కాగా పెద్దాపురం మున్సిపాలిటీలోని 29 వార్డులకు మండలంలో ఉన్న 23 గ్రామాల్లో 54 రేషన్ షాపులున్నాయి. రేషన్ షాపుల నుంచి సరకులు తీసుకొని వెళ్లి ఇంటింటా అందజేయడానికి పట్టణ, మండలంలోని గ్రామాలకు 28 ఎండీయూ వాహనాలు మంజూరు చేశారు. దాంతో పట్టణ, మండలంలోని 23 గ్రామాలకు చెందిన 40,045 మంది రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు ఇంటి వద్దనే సరకులు పొందుతున్నారు.


సామర్లకోట పట్టణం

ప్రజలు ఇబ్బందులు పడకూడదనే..

లబ్ధిదారుల ఇళ్ల వద్దే రేషన్ సరకులు ఇచ్చే వాహనం వచ్చేలా సామర్లకోట పట్టణానికి 10, మండలంలో గ్రామాలకు 18 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. దాంతో 28 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది. మొత్తం 44,561 మందికి మేలు జరుగుతోంది. నేడు ప్రజల ఇంటి వద్దే ఎలక్ట్రానిక్ కాటాతో సరకులను తూచి అందజేస్తున్నారు. నాణ్యమైన బియ్యం అందుతున్నాయని వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో దూరం వెళ్లాల్సి వచ్చేది


భర్త లేక పోవడంతో రేషన్ సరకులు తీసుకోవడానికి ఎఫ్‌సీఐ గోదాముల నుంచి జయలక్ష్మీ థియేటర్ వద్ద రేషన్ షాపునకు కి.మీ. దాటి వెళ్లాల్సి వచ్చేది. ఒక వైపు మద్యంషాపు, మరోవైపు బారు ఉండటంతో రాత్రి సమయంలో ఇబ్బంది కరంగా ఉండేది. ప్రస్తుతం రేషన్ సరకుల వాహనం ప్రతి నెలా ఇంటికే వస్తోంది. పదో తేదీ లోపుగా సరకులు అందుతున్నాయి.

– మారిన అప్పయమ్మ, సత్యనారాయణపురం, సామర్లకోట

మోసాలకు అవకాశం లేదు


ఎండీయూ వాహనంలో రేషన్ సరకులు ఎలక్ట్రానిక్ కాటా ద్వారా ఇంటి వద్దనే తూకం వేస్తున్నారు. మోసాలకు అవకాశం లేదు. నాణ్యత కలిగిన సన్న బియ్యం అందుతున్నాయి. రేషన్‌కార్డులో సభ్యులెవరున్నా సరకులు తీసుకోవచ్చు. రేషన్ వెతలు తప్పాయి.

– మచ్చా బిందు, గృహిణి, వీకే రాయపురం, సామర్లకోట మండలం

వాహన సైరన్‌తో అప్రమత్తం


ఎండీయూ వాహనం సైరన్ మోగిస్తూ ఇళ్ల వద్దకు రావడంతో అప్రమత్తం అవుతున్నాం. గతంలో రేషన్ తీసుకోవడానికి అర కి.మీ. నడిచి వెళ్లాల్సి వచ్చేది. సాయంత్రం సమయంలో మహిళలు ఒంటరిగా సరకులు తీసుకొని రావడం ఎంతో కష్టంగా ఉండేది. ఎండీయూ వాహనంతో సరకులు ఇళ్ల వద్దనే చేరుతున్నాయి.

– బొందల కృష్ణవేణి, గృహిణి, సామర్లకోట

341 మంది వలంటీర్ల రాజీనామా

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా ఇప్పటివరకూ 341 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో 545 మంది వలంటీర్లకు గాను 341 వలంటీర్లు రాజీనామా చేశారని చెప్పారు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారన్నారు. కాగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన తమపై ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి నిరసనగా రాజీనామా చేసినట్టు వలంటీర్లు తెలిపారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం


చిన్నారి తండ్రికి నగదు అందజేస్తున్న రాజేష్‌కుమార్

పెద్దాపురం: మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి సేవలను మరింత విస్తృతం చేస్తామని సంస్థ వ్యవస్థాపకుడు దేవత రాజేష్‌కుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారి ప్రత్యూషవర్థిని బోన్ చికిత్స కోసం రూ.1,03,500 నగదును దాతల సహకారంతో తండ్రి కుమారస్వామికి అందజేశారు. స్థానిక మెయిన్ రోడ్డులో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమిస్తూ, తమ వంతు సహకారం అందిస్తామన్నారు. గత మూడేళ్లలో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు సంస్థ తరపున సహకారం అందించామని చెప్పారు. ఇప్పుడు పేద విద్యార్థి ఆపరేషన్ కోసం పెద్ద మొత్తాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు రౌతు గోవిందు, విజయలక్ష్మి, దాడి శివాజీ, మట్టే శ్రీనివాసరావు, గొల్లపల్లి రేవంత్, మొల్లి శాంతి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగన్ నాంది


సామర్లకోటలో ఓట్లు అభ్యర్థిస్తున్న దవులూరి దొరబాబు

- స్థానిక అభ్యర్థిగా ప్రజల ముందుకు..
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి ఎన్నికల ప్రచారం

సామర్లకోట: దేశ చరిత్రలో సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం స్థానిక 18, 19, 21 వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, గోలి ప్రసాద్, కేతా సాయి, పెండ్యాల అబ్బు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు నూకాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన దొరబాబుకు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య, కమిటీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసు, మాజేటి కృష్ణ స్వాగతం పలికారు. పూజలు అనంతరం దొరబాబును కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, విమర్శలు గుప్పించిన ప్రతిపక్ష నాయకులు.. ఇప్పుడు కల్లబొల్లి హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టడానికి చంద్రబాబు అమలు సాధ్యంకాని హామీలను గుప్పిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. మాట ఇస్తే అమలు చేసే నాయకుడిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి టిక్కెట్టు కోసం ప్రయత్నిస్తుండగా, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం తనకు కల్పించారని, ప్రతిఒక్కరూ తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రజలందరికీ అందుబాటులో, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజల వద్దకే పాలన అందించేలా సచివాలయ, వలంటీరు వ్యవస్థను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొస్తే, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వాటిని అందకుండా చేశారని ఆరోపించారు. చాలా కాలం తర్వాత స్థానికుడు పోటీ చేయడం తమకెంతో సంతోషంగా ఉందని ఓటర్లు దొరబాబుకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ చైర్మన్ గోరకపూడి చిన్నయ్యదొర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, కార్యదర్శి సేపెని సురేష్, సీనియర్ నాయకులు మసకపల్లి సత్యనారాయణ, చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేను లోకల్... పిలిస్తే పలుకుతా...!


కందరాడ ఎన్నికల ప్రచారంలో వంగా గీతకు బొట్టు పెడుతున్న మహిళ

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: నేను పక్కా లోకల్.. ఎవరు పిలిచినా వెంటనే పలుకుతా.. పిలిస్తే పలికేంత దూరంలో ఉంటాను.. ఎల్లప్పుడూ మీ వెన్నంటే ఉండి మీకు మంచి చేస్తాను.. వచ్చే ఎన్నికల్లో నన్ను ఆదరించండి అని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. పిఠాపురం మండలం కందరాడ, నవఖండ్రవాడ గ్రామాలు, పిఠాపురం పట్టణంలోని 15వ వార్డులో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఆమెకు స్థానికులు హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు ఆమెకు సాదర స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. ఏ సమస్య అయినా పరిష్కరించగల సత్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. అడిగినా పట్టించుకోని ప్రస్తుత రోజుల్లో అడగకుండానే ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించిన వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మూడు పార్టీల కూటమిలో కుమ్ములాటలు తప్ప రాష్ట్ర ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏమాత్రం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి పిఠాపురం ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కోలాహలం


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. స్వామివారికి ప్రీతైన సోమవారం రోజు కావడం, విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో ఉదయం నుంచీ భక్తులు ఆలయానికి తరలివచ్చి, స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజ, తొలి అభిషేకాలను నిర్వహించారు. ఈఓ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న మూలవిరాట్, ఉప ఆలయాల్లోని స్వామివారికి, అమ్మవార్లకు పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర


మహాలక్ష్మి అమ్మవారు

కొత్తపల్లి: పొన్నాడ శివారు రావివారిపోడులో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిచారు. ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మండుటెండనూ లెక్కచెయ్యక..

సునీల్ భార్య బిందు, దొరబాబు భార్య కళ విస్తృత ప్రచారం


పులిమేరులో ప్రచారం చేస్తున్న సునీల్ భార్య బిందు


తూర్పుపాకల ఎన్నికల ప్రచారంలో దొరబాబు భార్య కళ

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ భార్య బిందు, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు భార్య కళ మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తన భర్తను గెలిపిస్తే కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 400 గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని సునీల్ భార్య బిందు సోమవారం పెద్దాపురం మండలం పులిమేరు, సిరివాడ గ్రామాల్లో తుమ్మల మోహన్. సురేష్, అచ్యుతరామయ్య, భీమలింగం సూర్యనారాయణమూర్తి, ఇనకొండ వీరవిష్ణుచక్రం, బూరాడ వీర్రాఘవమ్మ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అదే విధంగా దొరబాబు భార్య కళ మండలంలోని తూర్పుపాకల, చదలాడ గ్రామాల్లో అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మాదిరెడ్డి రాంబాబు, లక్ష్మి, ఒబలిశెట్టి అబ్బాయి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుడు, అందరికీ అందుబాటులో ఉండే తన భర్త దొరబాబును గెలిపిస్తే నియోజకర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారంటూ ఇంటింటా ప్రచారం చేశారు. వీరిద్దరూ వేర్వేరుగా ప్రచారం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, దొరబాబుకు తమ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని బిందు, కళ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల వరహాలయ్య, గౌరి, రాధిక, ఇందిర, పెద్ద, తోట చినబాబు, తోట ఈశ్వరరావు, మద్దూరి వెంకటేశ్వరరావు, ఇనకొండ వీరభద్రం, తుమ్మల శ్రీను, సుందరెడ్డి రాజు, వెన్నా చిట్టిబాబు పాల్గొన్నారు.

జగనన్న వెంటే జనం


గోర్సలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత కుమార్తె సత్యపావని, అల్లుడు సురేష్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కుమార్తె సత్యపావని
- గోర్సలో ఎన్నికల ప్రచారం

కొత్తపల్లి: అన్నివర్గాలకూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలు ఉన్నారని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గీత కుమార్తె సత్యపావని, అల్లుడు సురేష్ అన్నారు. మండలంలోని గోర్సలో సోమవారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వంగా గీత ఎమ్మెల్యేగా, ఎంపీగా పిఠాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించే పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతకు ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసంశెట్టి ఆదినారాయణ, పూజ్యం సతీష్‌బాబు, వెలిగట్ల నాగేశ్వరరావు, శ్రీనివాస్, పెదిరెడ్ల నాగరాజు, ఎం.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యూఏసీ కార్యకలాపాలపై సమీక్ష

బాలాజీచెరువు: ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టరేట్‌కు సంబంధించిన కార్యకలాపాలపై జేఎన్‌టీయూకే వీసీ హాల్లో సోమవారం వీసీ ప్రసాదరాజు సమీక్ష నిర్వహించారు. నాక్ మార్గదర్శకాలను అనుసరించి రెగ్యులర్ ప్రాతిపదికన ఐక్యూఏసీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పార్ట్‌టైం పీహెచ్‌డీ చేయడానికి అవకాశాలు విశదీకరించారు. ఇన్నోవేషన్ ఫెయిర్స్ ద్వారా అధ్యాపకులు విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయవచ్చని వివరించారు. సెమినార్లు, వర్క్‌షాపులు, స్టూడెంట్స్ ప్రోగ్రాంపై గత మూడేళ్లకు సంబంధించి పరిశోధన పత్రాలు, ఆవిష్కరణలపై చర్చించారు. ఇటీవల అమెజాన్ సంస్థ విద్యార్థులకు రూ.రెండు లక్షల స్కాలర్‌షిప్, ల్యాప్‌టాప్ వంటి సౌకర్యాలు కల్పించడంపై ప్లేస్‌మెంట్ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఐఎస్‌టీ డైరెక్టర్ గోపాలకృష్ణ, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పాల్గొన్నారు.

కష్ట మే..!

- నాలుగు రోజులుగా ఠారెత్తిస్తున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
- బెంబేలెత్తుతున్న వృద్ధులు, చిన్నారులు


నిర్మానుష్యంగా మారిన కాకినాడ జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్

కాకినాడ సిటీ: ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. రోజూ 40 డిగ్రీల సెల్సియస్ దాటుతుండడంతో జనం ఠారెత్తిపోతున్నారు. మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. మూడు రోజులుగా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో వారం రోజుల సైతం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

జంకుతున్న జనం

మండుతున్న ఎండలకు బయట అడుగు పెట్టాలంటేనే కాకినాడ వాసులు జంకుతున్నారు. ఉదయం 8–9 గంటల నుంచే ఎండ సుర్రుమంటోంది. ఉదయం పది దాటిందంటే ఇక సాయంత్రం ఆరు దాకా మండుతూనే ఉంది. ఎండలో ఏ మాత్రం తిరిగినా, డీ హైడ్రేషన్ తప్పడం లేదు. సకాలంలో సరిపడా నీళ్లు తాగకపోతే వడదెబ్బ బారిన పడాల్సి వస్తోంది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టుకున్నా వేడిని తాళలేకపోతున్నారు. ఫ్యాన్‌గాలి కూడా వేడిగా వస్తుండటంతో ఆపసోపాలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు మరింత అవస్థలు పడుతున్నారు.

రోడ్లు నిర్మానుష్యం

ఉదయం పది దాటితే చాలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పని ఉన్న వారు మాత్రమే బయటకు వస్తున్నారు. చిరు వ్యాపారులు, వైద్య సేవలు అవసరం ఉన్న వారే రోడ్లపై కనిపిస్తున్నారు. ఎండ తీవ్రతతో చల్లటి పానీయాలు, చెరుకురసం తాగేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

ద్రవ పదార్థాలు తీసుకోవాలి

ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ లాంటివి తీసుకోవడం శ్రేయస్కరం. కనీసం రోజుకు ఆరు లీటర్ల నీరు తాగాలి. రోడ్లపై కనిపించే చల్లటి రంగు పానీయాలు, మద్యం తీసుకోకపోవడమే మంచిది.

వడదెబ్బకు గురైతే..

వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. గాలి బాగా తగిలేలా చూడాలి. కొబ్బరినీరు, గ్లూకోజ్, మజ్జిగ, ఓఆర్ఎస్ తాగించాలి. దుస్తులను వదులుగా చేసి, తడిగుడ్డతో ఒళ్లంతా తుడవాలి. కీరదోస ముక్కలు తినిపించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే.. వెంటనే వైద్యులను సంప్రదించాలి.

గత నాలుగు రోజుల ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రత
మే 1	41.9
మే 2	42.6
మే 3	42.8
మే 4	42.2
మే 6	40.4

పురోహిత క్రికెట్ టోర్నీ విజేత కాకినాడ

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఇంద్రపాలెం గ్రామానికి చెందిన దివంగత యల్లాజ్యోసుల శేషు ఎందరో యువ క్రీడాకారులను తయారు చేశారని క్రికెట్ సంఘ మాజీ అధ్యక్షుడు తలాటం హరిష్ అన్నారు. సోమవారం స్థానిక శశికాంత్ నగర్‌లోని క్రిక్స్ 8 నెట్స్‌లో యల్లాజ్యోసుల శేషు స్మారక బ్రాహ్మణ బాక్స్ క్రికెట్ రాష్ట్ర స్థాయి టోర్నీ ముగింపు జరిగింది. ఫైనల్స్‌లో కాకినాడ విజేత కాగా, హైదరాబాద్ రన్నర్స్‌గా నిలిచింది. బహుమతీ ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథి తలాటం హరిష్ విజేతలకు కప్‌లను అందజేశారు. కార్యక్రమంలో నేమాని ఆస్ట్రాలజీ ప్రతినిధి రమేష్, వీరబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి యూత్ జట్టుకు క్రికెట్ కిట్ అందజేత

హరిష్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రెల్లి యూత్ క్రికెట్ జట్టుకు రూ.15 వేల విలువైన క్రికెట్ కిట్‌ను సోమవారం అందజేసినట్టు హరిష్ తెలిపారు. యువత సన్మార్గంలో నడిపేందుకు ఏటా రాష్ట్ర స్థాయి రెల్లి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాకినాడలోని హరిష్ స్పోర్ట్స్ వద్ద ఈ కిట్‌ను యూత్ సభ్యులకు అందజేశారు.